సాక్షి
మెదక్
సోమవారం । 16 । అక్టోబర్ । 2023



హస్తంలో ఉత్కంఠ

పటాన్‌చెరు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు అనేది ఇంకా ఖరారు కాలేదు. కాటా శ్రీనివాస్ గౌడ్, గాలి అనిల్ కుమార్, నీలం మధు మధ్య పోటీ నెలకొంది. వివరాలు 10లో ▸



బీజేపీ టికెట్ దక్కేదెవరికి?

నర్సాపూర్ బీజేపీ టికెట్ కోసం పలువురు నాయకులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాలు 10లో ▸

నేటి ప్రజావాణి రద్దు

మెదక్ కలెక్టరేట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

‘గౌరవెల్లి’ బాధ్యత నాదే



- ఆరు నెలల్లో పూర్తి చేస్తాం
- లక్షకు పైగా ఎకరాలకు నీరు అందిస్తాం
- హుస్నాబాద్ సభలో సీఎం కేసీఆర్ స్పష్టీకరణ
- ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు జనం మధ్యే బీఫాం అందజేత



సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, హాజరైన జనం

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత నాదేనని సీఎం కేసీఆర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభ జరిగింది. సభలో సీఎం కేసీఆర్ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గౌరవెల్లి ప్రాజెక్టును ప్రతిపక్షాలు కుట్రలు చేసి, కేసులు వేసి అడ్డుకున్నప్పటికీ ఒక్కొక్కటిగా అధిగమిస్తూ పనులు పూర్తి చేశామని, మెయిన్ కెనాల్ మాత్రమే పూర్తి చేయాల్సి ఉందని సీఎం అన్నారు. ఎన్నికల తర్వాత 6 నెలల్లో పూర్తి చేసి నేనే వచ్చి ప్రాజెక్టును ప్రారంభిస్తానన్నారు. ఈ ప్రాజెక్టుతో 1.06లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. మహాసముద్రం గండిని పూడ్చాలని కెప్టెన్ లక్ష్మీకాంతారావు నా దృష్టికి తెచ్చినప్పుడు, తనతో పాటు నా మిత్రుడు కవ్వ లక్ష్మారెడ్డిలతో కలిసి గండి పరిశీలించి నిర్మాణ పనులు చేపట్టామన్నారు. మహాసముద్రం గండి నీటితో నిండటంతో 15 రోజుల్లో భూగర్భ జలాలు పెరిగి పంటలకు కావాల్సిన నీళ్లు అందుతున్నాయన్నారు. కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయ జాతరకు తాను వచ్చి మిఠాయిలు తిన్నానని నాటి జ్ఞాపకాలను సీఎం గుర్తు చేస్తుకున్నారు. దేవాలయాలన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో కొత్త బస్టాండ్, ఎల్కతుర్తిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ నా దృష్టికి తీసుకువచ్చారని, వాటిని కూడా పూర్తి చేసే బాధ్యత నాదేనని అన్నారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే సతీష్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజల మధ్యే సతీష్‌కు బీ ఫారం అందజేశారు.

90 శాతం ఓట్లు పడాలి..

20 ఏళ్ల క్రితం తెలంగాణ తెస్తామని గులాబీ జెండా పట్టి ప్రత్యేక రాష్ట్రం తెచ్చామని, అలాగే అభివృద్ధి చేశామని, 24గంటలూ కరెంట్, నీళ్లు ఇస్తున్నామని రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. చెప్పినవన్నీ చేశామని తెలిపారు. నూటికి తొంబై శాతం ఓట్లను మనకే పడే విధంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు కేశవరావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సిద్దిపేట జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రూ.9 వేల కోట్లతో అభివృద్ధి: ఎమ్మెల్యే

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని 9 ఏళ్ల కాలంలో రూ.9,076 కోట్ల నిధులతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఐలు కుట్రలు చేసి గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకోనేందుకు ప్రయత్నం చేశారన్నారు. మూడోసారి మీ ఆశీర్వాదంతో గెలిచి గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు చేయడంతో పాటు రవాణ సౌకర్యం కోసం రోడ్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు.

నాటి కలలు సాకారం: మంత్రి

ఒకప్పుడు హుస్నాబాద్ కరువుపీడిత, కల్లోల ప్రాంతంగా ఉండేదని, ప్రస్తుతం పచ్చటి పొలాలతో కళకళలాడుతున్నదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గోదావరి నీళ్లు, రెవెన్యూ డివిజన్, డీఎస్పీ, మున్సిపాలిటీ, కొత్తగా అక్కన్నపేట మండలం కావాలని ఇలా ఎన్నో కలలు సాకారమయ్యాయని అన్నారు. ఎమ్మెల్యే సతీష్‌కుమర్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మచ్చలేని నాయకుడన్నారు. వచ్చే ఎన్నికల్లో అక్కడ కేసీఆర్, ఇక్కడ సతీష్‌కుమార్‌కు హ్యాట్రిక్ అందించే విధంగా మీ తీర్పు ఉండాలని మంత్రి హరీశ్‌రావు కోరారు.

మొదటి జాబితాలోనే..

- మైనంపల్లి రోహిత్‌కు మెదక్ కాంగ్రెస్ టికెట్
- ఖరారు చేసిన అధిష్ఠానం
- ఇప్పటికే నియోజకవర్గంపై పట్టు
- తండ్రితో కలిసి ఆత్మీయ సమ్మేళనాలు

మెదక్: ఎట్టకేలకు మెదక్ కాంగ్రెస్ అభ్యర్థిని అధిష్ఠానం ఖరారు చేసింది. మొదటి జాబితాలోనే మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తనయుడు రోహిత్ పేరును ప్రకటించింది. దీంతో ఎంఎస్ఎస్ఓ సభ్యులతో పాటు పార్టీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. తనయుడి టికెట్ కోసం బీఆర్ఎస్‌ను వీడిన హన్మంతరావు.. కాంగ్రెస్‌లో ఇద్దరూ టిక్కెట్ దక్కించుకున్నారు. హన్మంతరావు గతంలో మెదక్‌లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారు. దీంతో నియోజకవర్గంలో ఆయనకు మంచి పట్టు ఉంది. అది తన కొడుకు విజయానికి దోహదపడుతుందని మైనంపల్లి ఆశిస్తున్నాడు. అదేవిధంగా మైనంపల్లి ట్రస్టుద్వార తండ్రీకొడుకులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మెదక్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను రోహిత్ దత్తత తీసుకుని లక్షల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. అలాగే అనాథ పిల్లలను దత్తత తీసుకుని ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఒకరిద్దరికి ఇళ్లు కూడా కట్టించారు. తండ్రీకొడుకులు ఇప్పటికే నియోజకవర్గంలోని పాపన్నపేట, చిన్నశంకరంపేట, మెదక్ తదితర మండలాల్లో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ టిక్కెట్ రెండు నెలల క్రితమే ఖరారైంది. ఆదివారం మైనంపల్లి రోహిత్‌కు కాంగ్రెస్ టిక్కెట్ ఖరారు కావటంతో.. ఈ ఇద్దరి మధ్య మెదక్ నియోజక వర్గంలో హోరాహోరీగా ఎన్నికల పోరు సాగనుంది.

నర్సాపూర్‌లో ఎవరో..?

నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కాదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డికి బీఆర్ఎస్ టిక్కట్ కేటాయిస్తునట్లు ప్రచారం సాగుతుంది. దీంతో మదన్‌రెడ్డి కాంగ్రెస్ వైపు చూస్తునట్లు సమాచారం. సునీతారెడ్డికి బీఫాం ఇస్తే మదన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకుని టికెట్ ఇవ్వాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.

పద్మమ్మకు బీ-ఫామ్

హరీశ్‌తో సహా ఎనిమిది మందికి అందజేత



పద్మాదేవేందర్‌రెడ్డికి బీఫామ్ అందజేస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా ఆదివారం ఆ పార్టీకి చెందిన ఎనిమిది మంది అభ్యర్థులు బీ-ఫామ్‌లు అందుకున్నారు. తెలంగాణ భవన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 51 మంది అభ్యర్థులకు బీ-ఫామ్‌లతో పాటు, ఎన్నికల ఖర్చుల కోసం రూ.40 లక్షల చెక్కులను అందజేశారు. పటాన్‌చెరు నియోజకవర్గం అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి, అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్, నారాయణఖేడ్ నియోజకవర్గం ఎం.భూపాల్‌రెడ్డి, మెదక్ పద్మాదేవేందర్‌రెడ్డి, దుబ్బాక నుంచి కొత్త ప్రభాకర్‌రెడ్డి బీ-ఫారాలు పొందిన వారిలో ఉన్నారు. అలాగే మంత్రి హరీశ్‌రావుకు, జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వరరెడ్డికి ప్రగతిభవన్‌లో, హుస్నాబాద్ అభ్యర్థి సతీష్‌కుమార్‌కు సభావేదికపై బీఫామ్‌లను అందజేశారు. మిగతా అభ్యర్థులకు రెండో రోజుల్లో వాటిని అందించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

న్యూస్‌రీల్

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ మేనిఫెస్టో



కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న దామోదర

అల్లాదుర్గం(మెదక్): పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటించినట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, అందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాంపూర్, ముప్పారం, కాయిదంపల్లి గ్రామాలలో పర్యటించి మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఓటమి భయంతో అమలు చేయలేని హామీలతో మేనిఫెస్టో ప్రకటించారని ఎద్దేవా చేశారు. గతంలో ఇచ్చిన హామీలనే తుంగలో తొక్కారని మండిపడ్డారు. జర్నలిస్టులకు 400 గ్యాస్ సిలిండర్ ఇస్తానని ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు. వ్యతిరేక వార్తలు రాస్తున్నారని అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ జర్నలిస్టులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శేషారెడ్డి, బల్‌రాం, నర్సింహరెడ్డి, శ్రీశైలం, బాలకిషన్, కిరణ్, మధు, బేతయ్య, అభిలాష్‌రెడ్డి, శేషు, రవి పాల్గొన్నారు.

దోచుకున్న డబ్బుతో వస్తున్నారు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్: బీఆర్ఎస్ నాయకులు దోచుకున్న డబ్బుతో ప్రజలకు తాయిలాలు ఇచ్చి మరోసారి గద్దెనెక్కాలని చూస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ గజ్వేల్‌లోని తన ఫామ్‌హౌజ్ నుంచి పింఛన్లు తెచ్చి ఇవ్వటంలేదని, అది మన డబ్బేనన్నారు. దేశంలోనే మద్యం అమ్మకంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. కిరాణా దుకాణంలో ఉప్పు పప్పులా మందు అమ్ముతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పరీక్ష జరిగినా లీకేజీ అవుతుందని అన్నారు. నోటిఫికేషన్లతో ప్రభుత్వం ఖజానా నింపుకుంటుందన్నారు. ప్రవళిక లాంటి నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటుంటే.. లేనిపోని ఆరోపణలు చేస్తూ పోలీసులు రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, తాళ్లపల్లి రాజశేఖర్, నందు జనార్దన్‌రెడ్డి, నందారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

రెండు రోజులు నీటి సరఫరా బంద్

నర్సాపూర్: రెండు రోజుల పాటు భగీరథ నీటి సరఫరా ఉండదని మిషన్ భగీరథ పథకం డీఈఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చక్రియాల్ వద్ద నీటి లిఫ్టింగ్‌లో లీకేజీ అవుతుందని, దానికి మరమ్మతులు చేయాల్సి రావడంతో సోమ, మంగళవారం రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లోని గ్రామాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, గుమ్మడిదల్ల మండలాల్లోని గ్రామాలకు నీటి సరఫరా ఉండదని వివరించారు.

మహిళా రైతు కూలీలకు ‘ఆహారభద్రత’ కల్పించండి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ మహిళా రైతు, కూలీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని ఆహార భద్రత సలహాదారులు ప్రొఫెసర్ రమా మేల్కోటే, మహిళా రైతుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ఆశాలత కోరారు. ఆదివారం మండల పరిధిలోని లింగుపల్లిలో కేరింగ్ సిటిజెన్ కలెక్టివ్, నేలమ్మ మహిళా రైతుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆహార భద్రత చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఒంటరి మహిళలతో సహా 18 ఏళ్లు నిండిన గ్రామీణ కుటుంబ సభ్యులకు రైతు బీమా లాంటి సాంఘిక భద్రత పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, సీసీసీ డైరెక్టర్ సజయ, నేలమ్మ అధ్యక్షురాలు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

● శైలపుత్రి అలంకారంలో..



ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై తీసుకువస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, చైర్మన్ బాలగౌడ్



శైలపుత్రి అలంకారంలో అమ్మవారు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయలలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో పసుపురంగు వస్త్రాలతో భక్తులకు దర్శనమిచ్చారు. పాలవకర్గ చైర్మన్ బాలగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డితో కలిసి అదనపు వెంకటేశ్వర్లు దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై గోకుల షెడ్డు వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

● యూత్ ఫెస్టివల్ డే



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం యూత్ ఫెస్టివల్ డే ను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు శిలువతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం గురువు దేవసాయం దైవ సందేశమిచ్చారు. కార్యక్రమంలో జోయల్‌శ్యాం ఉన్నారు. - మెదక్

కాంగ్రెస్ రేసుగుర్రాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 11 స్థానాలకు గాను కాంగ్రెస్ తన తొలి జాబితాలో అందోల్, సంగారెడ్డి, జహీరాబాద్, మెదక్, గజ్వేల్ అభ్యర్థులను ఖరారు చేసింది. పటాన్‌చెరు, నారాయణఖేడ్, నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట, హుస్నాబాద్ అభ్యర్థిత్వాలను పెండింగ్ పెట్టింది.

- తొలి జాబితా విడుదల
- ఉమ్మడి జిల్లాలో 11 స్థానాలకు ఐదు ఖరారు.. ఆరు పెండింగ్
- అందోల్‌కు దామోదర, సంగారెడ్డికి జగ్గారెడ్డి, జహీరాబాద్‌కు చంద్రశేఖర్
- మెదక్ నుంచి రోహిత్, గజ్వేల్ టికెట్ తూంకుంటకు..
- పటాన్‌చెరు, నర్సాపూర్, దుబ్బాక, ఖేడ్, సిద్దిపేట, హుస్నాబాద్ సెగ్మెంట్లు వాయిదా



దామోదర రాజనర్సింహ | ఏ.చంద్రశేఖర్ | జగ్గారెడ్డి | తూంకుంట నర్సారెడ్డి | మైనంపల్లి రోహిత్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కాంగ్రెస్ అధిష్ఠానం ఆదివారం ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో జిల్లాకు చెందిన ముఖ్యనేతలకు చోటు దక్కింది. అందోల్ టికెట్ ఆ పార్టీ సీనియర్ నేత దామోదర రాజనర్సింహకు ఖరారైంది. ఇక్కడ ఆయనతోపాటు కూతురు త్రిష దామోదర మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆయనకే టికెట్ ఖరారు చేసింది. సంగారెడ్డి టికెట్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి దక్కింది. ఈ అభ్యర్థిత్వం కోసం మనబీస్ ఫౌండేషన్ చైర్మన్ ముఖీం, దామోదర రాజనర్సింహ అనుచరుడు సంగమేశ్వర్ తదితరులు దరఖాస్తు చేసుకోగా అధిష్ఠానం పరిగణలోకి తీసుకోలేదు. ఇక జహీరాబాద్ టికెట్‌ను మాజీ మంత్రి ఆగం చంద్రశేఖర్‌కు ఖరారు చేసింది. వికారాబాద్ జిల్లాలో రాజకీయ ప్రస్థానం ఉన్న ఆయన బీజేపీ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి హన్మంతరావు కుమారుడు మైనంపల్లి రోహిత్‌కు మెదక్ టికెట్ దక్కింది. ఈ టికెట్ కోసం డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి గట్టి ప్రయత్నాలు చేశారు. కానీ రోహిత్‌కే ఖరారైంది. గజ్వేల్ టికెట్‌ను తూంకుంట నర్సారెడ్డికి ఖరారు చేసింది. మొత్తంగా ఐదుగురికి తొలిజాబితాలో చోటు దక్కింది.

ఆరు నియోజకవర్గాల్లో ఉత్కంఠ

కాంగ్రెస్ అభ్యర్థిత్వాల విషయంలో ఆరు నియోజకవర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఆదివారం ప్రకటించిన 51 మంది అభ్యర్థుల జాబితాలో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ఐదు నియోజకవర్గాలకు మాత్రమే అధిష్ఠానం టికెట్లు ఖరారు చేసింది. నారాయణఖేడ్, పటాన్‌చెరు, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించలేదు. పటాన్‌చెరు టికెట్ విషయంలో మొదటి నుంచి పీటముడి నెలకొంది. ఇక్కడ కాటా శ్రీనివాస్‌గౌడ్, గాలి అనిల్‌కుమార్ పోటీ పడుతున్నారు. అలాగే నర్సాపూర్ టికెట్‌ను గాలి అనిల్, ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులు తదితరులు ఆశించారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో కాంగ్రెస్ కూడా ఈ అభ్యర్థిత్వం ప్రకటన విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. నారాయణఖేడ్‌లో మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. అధినాయకత్వం ఇద్దరితో మాట్లాడాకే వారిలో ఒకరికి టికెట్ ఖరారు చేయనుంది. మరోవైపు హుస్నాబాద్ టికెట్ కోసం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. పొత్తులో భాగంగా ఈ స్థానం సీపీఐకి కేటాయిస్తారనే ప్రచారం జరిగినా ఇతర నియోజకవర్గం కేటాయించే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అభ్యర్థే బరిలో ఉండనున్నారు. దుబ్బాక విషయంలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కత్తి కార్తీక కూడా ఈ టికెట్ ఆశిస్తున్నారు. సిద్దిపేట్ టికెట్‌ను భవానీరెడ్డి, హరీశ్ ఆశిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో విడుదల చేయనున్న రెండో జాబితాలో ఈ టికెట్లు అధిష్ఠానం ప్రకటించనుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

‘డివిజన్ ప్రకటిస్తేనే మద్దతిస్తాం’

దుబ్బాకటౌన్: దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ప్రకటిస్తేనే ఈ ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఇస్తారని సాధనసమితి జేఏసీ బాధ్యులు మాడవైన శ్రీకాంత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కిరాణ, జనరల్ వర్తక సంఘంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను నిలదీయాలన్నారు. డివిజన్ ఏర్పాటుపై సీఎం కేసీఆర్ స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. వ్యాపారులు కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో వ్యాపార సంఘాల నాయకులు చింత నాగేందర్, కూర ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

మల్లన్న సన్నిధిలో డిప్యూటీ స్పీకర్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న స్వామిని ఆదివారం రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకపూజలు చేశారు. ఇదిలా ఉంటే ఆలయం భక్తులతో సందడిగా మారింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 6 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. స్వామివారికి అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ ఏఈవోలు పర్యవేక్షించారు.



ఆలయంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

క్లుప్తంగా

మనస్తాపంతో పారిశుద్ధ్య కార్మికుడి ఆత్మహత్య

జగదేవ్‌పూర్(గజ్వేల్): మనస్తాపంచెంది పారిశుద్ధ్య కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బీజీ వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చీకట్ల మల్లయ్య(70) పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంటిలో నుంచి బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగు వారు పరిశీలించగా మల్లయ్య ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఉండడం గమనించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ అక్కడకు చేరుకుని కేసు నమోదు చేశారు. సర్పంచ్ మంజుల రమేష్, ఎంపీటీసీ కిరణ్‌గౌడ్ మల్లయ్యను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


కనకయ్య (ఫైల్)

జగదేవ్‌పూర్ (గజ్వేల్): మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కొత్తపేటలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొగిలి కనకయ్య(38) వ్యవసాయ పనులతో పాటు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజులుగా ఇంటి నుంచి వెళ్లి పొలాల మధ్య తిరుగుతున్నాడు. ఆదివారం గ్రామ శివారులోని ఓ పొలంలో శవమై కనిపించాడు. కనకయ్య శరీరంపై గాయాలు ఉన్నాయి. పోలీసులు అనుమానాస్పద మృతి కేసును నమోదు చేశారు.

రైలు కింద పడి యువకుడి బలవన్మరణం


అనిల్‌కుమార్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ (22) ఆదివారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్‌లో కార్మికునిగా పనిచేస్తున్న అనిల్.. శనివారమే గ్రామానికి వచ్చాడు. రాత్రి పొద్దుపోయే వరకు స్నేహితులతో గడిపాడు. ఉదయం రైలు పట్టాల పక్కనే నడుచుకుంటూ వెళుతుండగా, గ్రామానికి చెందిన రైతులు కొందరు చూశారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడంతో మృతదేహం తునాతునకలైంది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావూనాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో స్టీల్ దుకాణం దగ్ధం


స్టీల్ దుకాణంలో అగ్ని ప్రమాదం దృశ్యం

ములుగు(గజ్వేల్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో స్టీల్ దుకాణం దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం ములుగు మండలం వంటిమామిడిలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మసున శ్రీనివాస్ ఇరవై ఏళ్లుగా స్టీల్ దుకాణాన్ని నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం దుకాణంలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కౌంటర్ మీద కూర్చున్న శ్రీనివాస్.. మంటలను ఆర్పే ప్రయత్నంలో గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న అగ్నిప్రమాద కేంద్రం అధికారి కుమార్ బృందం మంటలను పూర్తిగా ఆపేశారు. కాగా, మంటలకు దుకాణంలోని స్టీల్ సామగ్రి, ఫర్నిచర్ దెబ్బతిన్నాయి. దాదాపు రూ. 25 లక్షల మేర నష్టం వాటిల్లి నట్లు యజమాని శ్రీనివాస్ తెలిపారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ ఛైర్మన్ బట్టు అంజిరెడ్డి, వైస్ ఛైర్మన్ నరేష్‌గౌడ్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కాంగ్రెస్‌లో ఉత్కంఠ


నీలం మధు ముదిరాజ్


కాట శ్రీనివాస్ గౌడ్


గాలి అనిల్ కుమార్

పటాన్‌చెరు టికెట్ కోసం పోటాపోటీ
- నీలం మధు కోసం ఖమ్మం నేత పైరవీ
- కాటా తరఫున అధికార పార్టీ నేత లాబీయింగ్

పటాన్‌చెరు: పటాన్‌చెరు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు అనేది ఇంకా ఖరారు కాలేదు. కాటా శ్రీనివాస్ గౌడ్, గాలి అనిల్ కుమార్, నీలం మధు మధ్య పోటీ నెలకొంది. కాటా శ్రీనివాస్ గౌడ్‌కు టికెట్ వస్తుందని భావించినప్పటికీ, తెరపైకి అనూహ్యంగా నీలం మధు వచ్చారు. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి బీఫారం అందుకున్నారు. కొన్ని వారాల క్రితమే మహిపాల్ రెడ్డి తన ఎన్నికల ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. కానీ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనేది ఇంకా స్పష్టం కాలేదు. కాంగ్రెస్ తొలి విడత అభ్యర్థుల జాబితాను ఆదివారం వెలువరించింది. అందులో కాంగ్రెస్ పటాన్‌చెరు అభ్యర్థిని మాత్రం ప్రకటించలేదు. దీంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

కాంగ్రెస్ నుంచి మొత్తం ఎనిమిది మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. కాట శ్రీనివాస్‌గౌడ్ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆయనకే టికెట్ దక్కుతుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు. దరఖాస్తులు పెట్టుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే కుమారుడు మనోహర్ రెడ్డి, అమీన్‌పూర్ సర్పంచ్ శశికళ యాదవ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సపన్ దేవ్, గాలి అనిల్ కుమార్ ప్రధానంగా ఉన్నారు. కాట శ్రీనివాస్ గౌడ్‌కు టికెట్ ఇప్పించేందుకు మాజీ మంత్రి దామోదర రాజనర్సింహ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేత ఒకరు నీలం మధుకు టిక్కెట్ ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. నీలం మధు కూడా తన ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన ఒకవైపు కాంగ్రెస్‌లో ప్రయత్నం చేస్తూనే బీజేపీలో కూడా పైరవీ చేస్తున్నట్టు సమాచారం. ఆ విషయంలో ఆయనకు స్థానిక మాజీ ఎమ్మెల్యే సాయం చేస్తున్నారని తెలిసింది. అలాగే జగ్గారెడ్డి కూడా నీలం మధుకు మద్దతు ఇస్తున్నారని కాంగ్రెస్‌కు చెందిన పలువురు చెబుతున్నారు.

మాజీ మంత్రికి రూ.పది కోట్లు ఆఫర్

కాటా శ్రీనివాస్ గౌడ్‌కు టికెట్ వస్తే మంచిదని అధికార పార్టీ భావిస్తోందనే ప్రచారం ఉంది. శ్రీనివాస్ గౌడ్‌కే టికెట్ ఇప్పించాలని ఓ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి తనకున్న కాంగ్రెస్ సంబంధాలను వినియోగిస్తున్నారని, అందు కోసం ఒక మాజీ మంత్రికి రూ.పది కోట్లు ఆఫర్ చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పుకార్లను పక్కన పెడితే రెండు దశాబ్దాలుగా శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్‌తోనే కొనసాగడం, రాహుల్ గాంధీ పాదయాత్రను విజయవంతం చేయడంతో తన వంతు కృషి చేయడం వంటి కార్యక్రమాల వల్ల ఆయనకే టికెట్ లభించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెపుతున్నాయి. పార్టీ ప్రాథమిక సభ్యత్వం లేని నీలం మధుకు కాంగ్రెస్‌లో అవకాశమే లేదని కాంగ్రెస్ నాయకులు వాదిస్తున్నారు.

గాలి అనిల్ కూడా..

నర్సాపూర్‌లో పోటీ చేయాలని ఆశించిన గాలి అనిల్ కుమార్ అక్కడ మదన్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుసుకుని, పటాన్‌చెరులో తనకు పోటీచేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది. మైనంపల్లి హన్మంతరావు, మదన్ రెడ్డితో చర్చలు జరిపిన తర్వాత నుంచి గాలి అనిల్‌కుమార్ పటాన్‌చెరు నుంచి టిక్కెట్ ఆశిస్తున్నారని ఢిల్లీ కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. నీలం మధు తన శిష్యుడని, తాను గెలుపు కోసం ఎంతైనా ఖర్చు చేస్తానని ఢిల్లీ నేతలను ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం సాగుతోంది.

జంగ్ తెలంగాణ

బీజేపీ టికెట్ దక్కేదెవరికి..?

రేసులో 9 మంది.. ఢిల్లీలో పైరవీల జోరు

నర్సాపూర్: నర్సాపూర్ బీజేపీ టికెట్ కోసం పలువురు నాయకులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన తొమ్మిది మంది నాయకులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లిగోపి, మరో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, పార్టీ నాయకుడు రఘువీరారెడ్డి, రాష్ట్ర ఓబీసీ నాయకుడు రమేష్‌గౌడ్, పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, పార్టీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ మల్లేష్‌గౌడ్, ఆయా మండల శాఖల పార్టీ అధ్యక్షులు నాగప్రభుగౌడ్, నర్సింలు, యాదగిరి ఉన్నారు. అయితే ముఖ్య నాయకుల సూచనల మేరకు మండల శాఖల అధ్యక్షులు నాగప్రభుగౌడ్, నర్సింలు, యాదగిరి రేస్ నుంచి తప్పుకున్నారు. పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ ఇస్తే వారి విజయం కోసం కృషి చేస్తామని ఒప్పుకున్నట్టు సమాచారం. మిగిలిన వారిలో మల్లేష్‌గౌడ్, పెద్దరమేష్‌గౌడ్, చిన్న రమేష్‌గౌడ్ పేర్లను పార్టీ రాష్ట్ర కమిటీ తొలగించి, మురళీయాదవ్, గోపి, రఘువీరారెడ్డిల పేర్లను కేంద్రపార్టీకి పంపినట్లు తెలిసింది.

ఎవరికి వారు ప్రయత్నాలు

రాష్ట్ర కమిటీ స్క్రూటినీ అనంతరం గోపి, మురళీయాదవ్, రఘువీరారెడ్డి ఎవరికి వారు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. కొందరు ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి పైరవీలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. తాము పార్టీకి చేసిన సేవలను, గతంలో తాము నిర్వహించిన పదవుల గురించి వివరిస్తూ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, అయితే పార్టీ అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయిస్తుందో చూడాలి మరి.

బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి


చంటి క్రాంతికిరణ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): ప్రజల దీవెనలతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని హైద్లాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తెలంగాణ భవన్‌లో ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో హామీలను నెరవేరుస్తాం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పటాన్‌చెరు: చేసిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. వారి ఆదరాభిమానాలతో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆదివారం అంబేడ్కర్ చౌక్ వద్ద పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గాన్ని పదేళ్లలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఆదర్శప్రాయంగా నిలిపామని తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించి పల్లెలను ప్రగతి బాటలో పయనింప చేశామన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.3లక్షల నగదు పట్టివేత..

సిద్దిపేటకమాన్: ఎన్నికల నియమావళిలో భాగంగా ఇస్లామియా కళాశాల చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.3 లక్షల నగదును పట్టుకున్నట్టు సిద్దిపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కళాశాల చౌరస్తా వద్ద శనివారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అర్ధరాత్రి సమయంలో పట్టణానికి చెందిన సాయిరెడ్డి కారును ఆపి తనిఖీ చేశారు. కారులో ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.3 లక్షల నగదు ఉన్నట్టు గుర్తించారు. ఆయన వద్ద నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి అందజేసినట్లు సీఐ తెలిపారు. నగదు, బంగారం తీసుకెళ్లే వారు తప్పకుండా అందుకు సంబంధించి ఆధారాలు, రసీదులు చూపించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మా కుటుంబానికి అవకాశమివ్వండి

మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజలింగం

చేర్యాల(సిద్దిపేట): బీఆర్ఎస్‌లో చేరిన పదేళ్ల నుంచి ఎలాంటి పదవులు లేకున్నా ప్రజా క్షేత్రంలోనే ఉంటూ సేవ చేస్తున్నానని, సీఎం కేసీఆర్ గుర్తించి తమ కుటుంబానికి అవకాశం కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్కసారి ఎమ్మెల్యే, రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేసిన తాను చేర్యాల ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. గడిచిన పదేళ్లలో తాను, తన కుమారుడు నాగపురి కిరణ్‌కుమార్ నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల దరి చేర్చామన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమంలో తన వంతు కృషి చేశానన్నారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్‌లో చేరినప్పటి నుంచి ఈరోజు వరకు తమకు ఎలాంటి పదవులు ఇవ్వలేదన్నారు.

సీఎం కేసీఆర్ నమ్మకాన్ని వమ్ముజేయ..

దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ నమ్మకాన్ని వమ్ముజేయనని.. నియోజకవర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆదివారం సీఎం కేసీఆర్ బీఫాం అందజేశారు. కొన్ని రోజుల క్రితమే దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. తనపై ఉన్న నమ్మకంతో దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మొదటి జాబితాలోనే బీఫారం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ అధినేత కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయన బీఫారం అందుకోవడంతో దుబ్బాక బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా సంబురాలు జరుపుకున్నారు.

అతివేగంతో అదుపుతప్పి..

- ఆగిఉన్న లారీని ఢీకొట్టిన టవేరా వాహనం
- బాలుడి మృతి.. పలువురికి తీవ్రగాయాలు


ప్రమాదంలో మృతి చెందిన బాలుడు


ప్రమాదానికి గురైన క్షతగాత్రులు

టేక్మాల్(మెదక్): అతివేగంతో వెళ్తున్న టవేరా వాహనం అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఓ బాలుడు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదం టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధి బోడ్మాట్‌పల్లి శివారులోని హైవేపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని షాపూర్‌నగర్‌కు చెందిన జహంగీర్ కుటుంబానికి చెందిన వాజియా బేగం, జమీదా బేగంలు నొప్పులతో బాధపడుతుండేవారు. కామారెడ్డి జిల్లాలోని పిట్లంలో నొప్పి నివారణ మందు తెచ్చుకోవడానికి టవేరా వాహనంలో బయల్దేరారు. డ్రైవర్ సోహైల్ ఆరీఫ్ వాహనాన్ని అతివేగంగా నడపడంతో బోడ్మాట్ పల్లి శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మైలు రాయిని ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా ముందు ఆగివున్న లారీని కూడా ఢీకొట్టడంతో టవేరా వాహనం పల్టీ కొట్టింది. వాహనంలో ఉన్న ఏడుగురు చిన్నారులు, నలుగురు పెద్దలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జోగిపేట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో చికిత్స పొందుతున్న బాలుడు జునైద్ జంషేద్ (9) మృతి చెందాడు. మెరుగైన చికిత్స కోసం మిగతా వారిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కష్టపడినా.. గౌరవం లేదు


ఫామ్‌హౌస్‌లో సమావేశమైన అసంతృప్త నేతలు

- బీఆర్ఎస్ సీనియర్ నేతల ఆవేదన
- ఫామ్‌హౌస్‌లో ప్రత్యేక సమావేశం

గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్ గెలుపునకు రెండు పర్యాయాలు కష్టపడి పనిచేసినా తమకు పార్టీలో కనీస గౌరవం ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ సీనియర్ నేతలు ఆరోపించారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఫామ్‌హౌస్‌లో ఆదివారం అసంతృప్త నేతలు టేకులపల్లి రాంరెడ్డి, చెట్టి సురేష్‌గౌడ్, సింగం సత్తయ్య, పిడిచెడ్ వెంకటరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీశైలంగౌడ్ తదితరులు సమావేశమయ్యారు. గజ్వేల్ నియోజవర్గంలోని బీఆర్ఎస్ పార్టీలో తమను పట్టించుకునే వారే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. 18న ఇదే ఫామ్‌హౌస్‌లో మరికొంతమంది అసంతృప్త నేతలతో సమావేశం నిర్వహించి ప్రస్తుత ఎన్నికల్లో ఎలాంటి కార్యాచరణతో ముందుకెళ్లాలనే అంశాన్ని ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చకు దారితీసింది.

30 కిలోల వెండి ఆభరణాలతో అలంకరణ


విశేష అలంకరణలో వాసవీ మాత

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని 30 కిలోల వెండి ఆభరణాలతో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి వాటిని అలంకరించి మూలవిరాట్టును ఊరేగించారు. మహిళల కోలాటాలు అలరించాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పులకించారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు కంది కృష్ణ, కోడూరి అంజయ్య, ప్రకాష్, సాయిరాజ్, ఒడేల రవి, గంప కృష్ణ, చీలపల్లి వెంకన్న, మల్లికార్జున శంకర్‌లతో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్గల్ క్షేత్రానికి నవరాత్రి శోభ

- శంభుని కొండపై చదువుల తల్లి
- రెండో బాసరగా ప్రసిద్ధి
- ఉత్సవాలతో భక్తుల సందడి


వర్గల్ శ్రీవిద్యా సరస్వతి క్షేత్రం


కొండపై కొలువైన సరస్వతి అమ్మవారు

వర్గల్(గజ్వేల్): సిద్దిపేట జిల్లాలోని వర్గల్ గ్రామంలో శంభుని కొండపై కొలువుతీరిన చదువుల తల్లి విద్యాసరస్వతి ఆలయం నవరాత్రి శోభను సంతరించుకుంది. శనివారం నుంచి ప్రారంభమైన ఉత్సవాలతో ఆలయ పరిసరాలు భక్తుల సందడిగా మారింది. బాసర తరువాత రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధి చెందిన సరస్వతీ ఆలయం ఇదే.. ఈ ఆలయం పిల్లల అక్షరాభ్యాసానికి ప్రసిద్ధి పొందింది. సిద్దిపేట, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని తీర్థయాత్రలలో ఇది ఒకటి. శంభుని కొండపై వెలసిన ఈ విద్యాసరస్వతి క్షేత్రం భాగ్యనగరానికి 50 కిలోమీటర్ల దూరాన, హైదరాబాద్- కరీంనగర్ రాజీవ్ రహదారికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది.

1989లో శిలాన్యాసం, 1992లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. నాటి నుంచి భక్తుల తాకిడి పెరిగి దినదిన ప్రవర్ధమానమై విరాజిల్లుతోంది. శంభుని కొండపై 700 ఏళ్ల నాటి స్వయంభు శంభులింగేశ్వరాలయం, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరాలయం, శ్రీశనీశ్వరాలయం, శ్రీలక్ష్మీ గణపతి, శ్రీ కల్యాణ వెంకటేశ్వరాలయాలు కొలువుదీరగా, శ్రీశారదాచంద్రమౌళీశ్వరాలయం నిర్మాణదశలో ఉంది. ఇక్కడ నిర్మించిన కంచి శంకరమఠం తెలుగురాష్ట్రాల్లోనే గుర్తించదగినది. వేద పాఠశాల, అక్షరాభ్యాస మహామండపం, నిత్యాన్నదాన సత్రాలతో పాటు యాత్రికులు బసచేసేందుకు, తాగునీటి, రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యపీడితులు కొండపైకి చేరేందుకు లిఫ్ట్ సౌకర్యం కూడా కల్పించారు.

నవరాత్రోత్సవాలు..

ప్రతియేటా ఆశ్వయుజ మాసంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూలనక్షత్రం రోజున అమ్మవారికి లక్ష పుష్పార్చన, పుస్తకపూజ, చండీ హోమం, మహర్నవమి రోజున అష్టోత్తర శతకలశాభిషేకం, విజయ దశమి రోజున విజయ దర్శనాది కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

క్షేత్రానికి బస్సు సౌకర్యం

వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రానికి సికింద్రాబాద్ గురుద్వార్ నుంచి ఉదయం 8, 10 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 4 గంటలకు భక్తులకు బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే సికింద్రాబాద్ నుంచి గజ్వేల్, సిద్దిపేట, కరీంనగర్ రూట్‌లో వెళ్లే బస్సులలో వర్గల్ క్రాస్‌రోడ్డు వరకు చేరి, అక్కడి నుంచి ఆటోలో క్షేత్రానికి చేరుకోవచ్చు.

కనుల పండువగా కలశ యాత్ర


కలశ యాత్రలో మహిళలు

జిన్నారం(పటాన్‌చెరు): దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలో జరిగిన కలశ యాత్ర కనుల పండువగా సాగింది. బొల్లారం మున్సిపల్ పరిధిలో గల బిహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన మహిళలు వందల సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా ఈ యాత్ర నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది.